సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



అన్నప్రసాద భవనానికి రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి క్షేత్రంలో వకుళామాత అన్నప్రసాద భవన నిర్మాణానికి తణుకుకి చెందిన రవిచంద్ర బాలబాలాజీ–లీల వెంకటసత్యవాణి దంపతులు రూ.లక్ష విరాళమిచ్చారు.



ఏసీబీకి పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్

ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. రైతు నుంచి రూ.28 వేల లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ పట్టుబడ్డారు.

కాయకల్ప తరువు



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి ఒక్క ఉమ్మడి తూర్పులోనే 1.30 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వరి తర్వాత అత్యధికంగా సాగయ్యే కొబ్బరి ఔషధాల గని. కొబ్బరి ఉత్పత్తుల ద్వారా రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా..

8 లో

న్యూస్‌రీల్

ప్రజా సమస్యలపై అలసత్వం తగదు

– జేసీ చిన్నరాముడు



వీల్‌చైర్ అందిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జేసీ చిన్నరాముడు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో సీతారామమూర్తి, డీఎల్‌డీవో పి.వీణాదేవితో కలిసి ఆయన పీజీఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 159 అర్జీలు అందాయన్నారు. వీటిలో 150 అర్జీలను ఆఫ్‌లైన్‌లో, 9 ఆన్‌లైన్‌లో స్వీకరించామన్నారు. నిడదవోలు మండలం రావిమెట్ల గ్రామానికి చెందిన వీరమల్ల జోషికకు ఆయన వీల్‌చైర్ అందజేశారు. అలాగే హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సమాచారం కోసం జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1097 అందుబాటులో ఉందని జేసీ తెలిపారు. హెచ్ఐవీ నివారణకు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో 60 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రచార కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేశారు.

ఉర్దూ టీచర్ల నియామకానికి చర్యలు

మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు షరీఫ్



కొంతమూరు జెడ్పీ స్కూల్‌లో స్కౌట్ విద్యార్థులతో ఎంఏ షరీఫ్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం)/రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రాధాన్యానికి అనుగుణంగా హైస్కూళ్లలో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ వెల్లడించారు. సోమవారం స్థానిక లక్ష్మీవారపుపేటలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ అప్పర్ ప్రైమరీ మున్సిపల్ స్కూల్, కొంతమూరులోని జెడ్పీ హైస్కూళ్లను సందర్శించారు. అక్కడి ముస్లిం కుటుంబాలు, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో 12 ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించినట్టు చెప్పారు. పరిస్థితులను బట్టి ఇంగ్లిష్ మీడియం బోధనను కూడా అందుబాటులోకి తెచ్చి, ఎలిమెంటరీ నుంచి జూనియర్ కళాశాలల వరకు ఉర్దూ నేర్చుకునే విద్యార్థుల సంఖ్య పెరగడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. తరగతిలో కనీసం 10 మంది, పాఠశాలలో 40 మందికి పైగా విద్యార్థులున్న చోట ప్రత్యేక ఉర్దూ ఉపాధ్యాయులను నియమించేలా చూస్తామన్నారు. ఆయన వెంట రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డీఈవో కె.వాసుదేవరావు, ఎంఈవో తులసీదాస్ తదితరులు ఉన్నారు.

ఎంఏ పొలిటికల్ సైన్స్‌ను కొనసాగించాలని వినతి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును కొనసాగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, డీవైఎఫ్ఐ జిల్లా కో–కన్వీనర్ డి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ, పొలిటికల్ సైన్స్ గ్రూపును యూనివర్సిటీ యాజమాన్యం ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు నిలిపివేయడం సరికాదన్నారు. యూనివర్సిటీ యాజమాన్యం చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని చెప్పారు. ఉద్దేశపూర్వకంగా ఈ గ్రూపు లేకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించి, గ్రూపును యథావిధిగా కొనసాగించకపోతే ఆ విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

చితికిన బతుకులకు మహానేత చేయూత



- ప్రతి మదిలో వైఎస్సార్ జ్ఞాపకాలు పదిలం
- సంక్షేమ ప్రదాతగా కీర్తి ప్రతిష్టలు
- ప్రజా ప్రయోజనాలు, పురోభివృద్ధికే పెద్దపీట
- తూర్పుగోదావరి జిల్లా అభివృద్ధిలో కీలక భూమిక
- సాగునీటి ప్రాజెక్టులతో మెట్ట రైతుకు మేలు
- ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి సంపూర్ణ ఆరోగ్యం
- సేవా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధం
- నేడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి

పేద, సామాన్య వర్గాలనే తేడా లేకుండా దుర్భర, దయనీయ పరిస్థితుల్లో ప్రజలు.. తమ జీవితాలు బాగుపడతాయన్న నమ్మకం వారిలో పూర్తిగా సన్నగిల్లిన తరుణమది.. పాలకవర్గం దోపిడీ విధానాలకు బలైపోతూ.. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో.. ఇక భగవంతుడే దిక్కని ప్రజలంతా నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న సమయాన.. ఆపద్బాంధవుడిలా అక్కున చేర్చుకున్నాడా మహానుభావుడు. నేనున్నా.. కష్టాలు తీరుస్తానంటూ భరోసా ఇచ్చారు. అనుకున్నదే తడవుగా దీన స్థితిలో ఉన్న ప్రజల తలరాతల్ని.. దిశానిర్దేశం లేని రాష్ట్ర రూపురేఖల్ని మార్చేశారు ఆ మహానేత, జన నాయకుడు.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి.

సాక్షి, రాజమహేంద్రవరం: అభివృద్ధి ప్రదాత.. ప్రజల ఆత్మ బంధువు.. సంక్షేమ దార్శనికుడు.. మెట్ట రైతుల మహనీయుడిగా దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. అక్కమ్మా.. చెల్లెమ్మా.. అంటూ ఆప్యాయత పంచుకుని కుటుంబ సభ్యుడిగా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు మహానేత. తూర్పుగోదావరి జిల్లా సంక్షేమం, అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, అనేక పథకాలకు శంకుస్థాపనలు చేశారు. వ్యవసాయ రంగాన్ని అగ్రభాగాన నిలిపేందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. అన్నదాతకు అండగా నిలిచేందుకు బడ్జెట్‌లో సింహభాగం రైతుల సంక్షేమానికి నిధులు కేటాయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది మందికి మెరుగైన వైద్యం అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఊపిరి పోశారు. విద్య, వైద్యం, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో సంపూర్ణ పురోగతి సాధించి, జిల్లా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన సుదీర్ఘ పాదయాత్రలో విన్న సమస్యలకు అధికారంలోకి వచ్చాక కార్యరూపం దాల్చారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

రూ.800 కోట్లతో రాకపోకలకు మార్గం సుగమం



గోపాలపురంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు (ఫైల్)

విజయవాడ–విశాఖపట్నం నగరాల మధ్య రాకపోకలు మరింత సౌకర్యవంతంగా చేసేందుకు వైఎస్సార్ రూ.800 కోట్లతో గామన్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టారు. 14 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగ్గా.. 4.5 కిలోమీటర్ల వరకు గోదావరి నదిపై వంతెన నిర్మించారు. 2008లో పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణంతో విశాఖ–విజయవాడకు 40 కిలోమీటర్ల మేర దూరం తగ్గింది.

రైతు బాంధవుడిగా ఖ్యాతి

- మహానేత వైఎస్సార్ రైతు బాంధవుడిగా ఖ్యాతి గడించారు. పావలా వడ్డీకే రుణాలు, రుణ మాఫీతో వెన్నుదన్నుగా నిలిచారు.
- బ్రాహ్మణగూడెంలో రూ.273.28 లక్షలు వెచ్చించి 1200 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. తద్వారా 600 ఎకరాల్లో ముంపు సమస్యకు పరిష్కారం చూపారు. తాళ్లపూడి మండలంలో 4,950 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.8.59 కోట్లు వెచ్చించి పైడిమెట్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. రూ.380.06 లక్షల వ్యయంతో చాగల్లులో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.
- తాళ్లపూడి మండలంలో సుమారు రూ.500 కోట్లు వెచ్చించి 16 మండలాల్లో 2,06,600 ఎకరాలకు సాగునీరు అందించే తాడిపూడి ఎత్తిపోతల పథకాన్ని రూపొందించారు. కొవ్వాడ కాలువ వరద ముంపు నివారణకు రూ.56 కోట్ల వ్యయంతో అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. దీంతో కొవ్వూరు, పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో 15 వేల ఎకరాలకు వరద ముంపు సమస్య తీరింది. వైఎస్సార్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టులో ఎక్కువ పనులను పూర్తి చేశారు. కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకువచ్చారు. కుడి, ఎడమల ప్రధాన కాలువలు తవ్వించారు.

మెట్ట రైతుల మహనీయుడిగా..

మెట్ట ప్రాంత రైతులకు మంచి చేయాలన్న తలంపుతో గోదావరి నదిపై తాడిపూడి సమీపంలో చింతపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. తద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించాలని ప్రయత్నించారు. ఆయన హయాంలో పనులు ప్రారంభించారు. రూ.15.26 కోట్లతో కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి మండలాల్లోని 4,950 ఎకరాలకు సాగునీరు అందించే ఆరికిరేవుల ఎత్తిపోతల పథకం కింద 90 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. కుమారదేవం ఎత్తిపోతల పథకాన్ని రూ.1.75 కోట్లతో పునరుద్ధరించారు.

అభాగ్యులకు కొండంత అండ

నిరాశా నిస్పృహల్లో ఉన్న అభాగ్యులకు మహానేత అండగా నిలిచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చే రూ.75 పింఛను సొమ్మును రూ.200కు పెంచారు. వికలాంగ పింఛను రూ.500కు పెంచిన ఘనత దివంగత వైఎస్సార్‌కే దక్కుతుంది. ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచకుండా సేవలందించారు. ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా చూశారు.

పాదయాత్ర పదిలం

దివంగత మహానేత పాదయాత్ర దేశంలోనే ప్రత్యేకత చాటుకుంది. ప్రసిద్ధ రోడ్డు కం రైలు వంతెనపై ఆయన పాదయాత్ర సాగింది. ఆ సమయంలో కొంతమూరు వద్ద అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా అక్కడే అర గంట పాటు విశ్రాంతి తీసుకుని, తిరిగి యాత్ర కొనసాగించారు. అనంతరం మధురపూడి ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉన్న తోటలో ఆరు రోజుల పాటు వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా రాజమండ్రిలోని ప్రముఖ నాయకులతో ముచ్చటించారు. అనంతరం 2003లో బస్సు యాత్ర సైతం చేపట్టారు.

నిడదవోలు అభివృద్ధికి అగ్రస్థానం

ఇలాఉండగా నిడదవోలులో 2005లో రాజీవ్ నగర బాట సందర్భంగా పట్టణంలో పర్యటించిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజీవ్ నగర బాటలో పట్టణానికి సుమారు రూ.కోటితో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, రూ.కోటితో సెంట్రల్ విద్యుత్ లైటింగ్, విద్యానగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. బాలాజీనగర్‌లో రూ.1.64 కోట్లతో నిర్మించిన 500 కేఎల్ సామర్థ్యం ఉన్న మంచినీటి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. పేదలకు సొంతగూడు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ పథకంలో భాగంగా 28వ వార్డు శివారున ప్రతిష్టాత్మకంగా గృహాలను నిర్మించిన ఘనత వైఎస్సార్‌కే దక్కింది. 832 మంది అర్హిదారులకు గృహాలను నిర్మించారు. రూ.70 లక్షలతో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపల్ కార్యాలయంగా నామకరణం చేశారు.

సేవా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలు, ప్రజలపై ఆయనకున్న అభిమానాన్ని మరోసారి గుర్తు చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆయన అభిమానులు సన్నద్ధమవుతున్నారు. పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు ఘన నివాళులు అర్పించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



కొంతమూరు వద్ద గామన్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న దివంగత సీఎం వైఎస్సార్ (ఫైల్)




సీతానగరం మండలం పురుషోత్తపట్నం తోట వెంకటాచలం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ప్రారంభోత్సవంలో మహానేత వైఎస్సార్ (ఫైల్)



ప్రజా ప్రస్థానం పాదయాత్రలో దివంగత వైఎస్సార్‌తో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు (ఫైల్)

కొనసాగుతున్న వరద ఉధృతి

- బ్యారేజీ వద్ద నిలకడగా 13.10 అడుగుల నీటిమట్టం
- 11.79 లక్షల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల



కాటన్ బ్యారేజీ నుంచి విడిచిపెడుతున్న గోదావరి మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ఎప్పటికప్పుడు మిగులు జలాలను దిగువకు విడిచిపెడుతున్నారు. సోమవారం ఉదయం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 13.10 అడుగులకు నీటి మట్టం చేరింది. అక్కడి నుంచి రాత్రి వరకు అదే స్థాయిలో కొనసాగుతోంది. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఆ ప్రభావం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మంగళవారం కనిపించే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. కాటన్ బ్యారేజీలోని మొత్తం 175 గేట్లను ఎత్తి సోమవారం రాత్రి 11,79,236 క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు సంబంధించి 13,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 9.64 మీటర్లు, పేరూరులో 14.16 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.49 మీటర్లు, భద్రాచలంలో 43.40 అడుగులు, కూనవరంలో 19.53 మీటర్లు, కుంటలో 10.77 మీటర్లు, పోలవరంలో 12.69 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.46 మీటర్ల వద్ద నీటిమట్టాలు కొనసాగుతున్నాయి.

లంక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని ఇరిగేషన్ ఎస్ఈ కూరెళ్ల గోపీనాథ్ తెలిపారు. వరద ఉధృతి ఈ నెల ఆరో తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. గత నెల 30న మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామన్నారు. నదీ పరీవాహక, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు వరద సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల సమయంలో నదిలోకి వెళ్లకుండా, ఒడ్డు నుంచే నిమజ్జనాలు చేయాలని సూచించారు. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద ఇరిగేషన్, ఇతర శాఖల ద్వారా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజలు మర పడవల్లో రేవులు దాటేటప్పుడు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలన్నారు. అక్టోబర్ చివరి వరకు వరద సీజన్ కొనసాగే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, తగిన చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి

– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



జ్యోతి వెలిగిస్తున్న మాధవ్, పక్కన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మాధవ్ రాష్ట్రంలో 'సారథ్యం' పేరుతో చేపడుతున్న యాత్ర సోమవారం రాజమండ్రి చేరింది. ఈ సందర్భంగా నగరంలో చాయ్ పే చర్చ, శోభాయాత్ర, పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులుకు నివాళులర్పించారు. మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి నేరుగా నిధులు ఇస్తోందన్నారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీఏకు 324 ఎంపీ సీట్లు వస్తాయని ఇండియా టుడే మూడ్ ఆఫ్ సర్వే తేల్చిందని, ఇప్పటికీ మోదీపై 58 శాతం ప్రజలు విశ్వాసం చూపుతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుతంలో కొన్ని ఇబ్బందులు సహజమని, సర్దుకుని ముందుకు వెళ్లాలన్నారు.

శోభాయాత్ర

నగరంలో 'సారథ్యం' శోభాయాత్రను వై–జంక్షన్ వద్ద మాధవ్ ప్రారంభించారు. జానపద కళారూపాలతో యాత్ర కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానం వరకు సాగింది. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో ఇద్దరికి చోటు



తగరం సోంబాబు



దాట్ల పృథ్వీరాజ్

రాజానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగంలో రాజానగరం నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జనరల్ సెక్రటరీగా తగరం సోంబాబు, జాయింట్ సెక్రటరీగా దాట్ల పృథ్వీరాజ్ నియమితులయ్యారు.

ఆనందమీనందమాయె..

- మనసు దోచుకుంటున్న అక్వేరియం కల్చర్
- ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం
- వాస్తు నమ్మకాలూ ఓ కారణం

రాయవరం: ఇంటిని అందంగా అలంకరించుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమిస్తారు. ఇప్పుడు ఇంటి అలంకరణలో అక్వేరియంలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఇంటీరియల్ డెకరేషన్‌లో భాగంగా అక్వేరియం ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నారు. అంతే కాకుండా సంస్కృతీ సంప్రదాయాలను పాటించే వారు, వాస్తుపరమైన నమ్మకంతో తమ సంపాదనను వృద్ధి చేసుకునే వారు, సుఖ సంతోషాలను పొందాలని నమ్మేవారు ఇప్పుడు చేపలను గాజు తొట్టె (అక్వేరియమ్స్)లో ఉంచుతున్నారు.

వ్యాపార సంస్థల్లోనూ..

అక్వేరియంలను ఇంటితో పాటు వ్యాపార సంస్థల్లో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం వ్యాపారులు అక్వేరియంలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, ఇళ్లల్లో స్థలానికి అవసరమైన ప్రమాణంలో అక్వేరియంలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. అందంతో పాటు, ఆదాయం వృద్ధి చెందుతుందని, వాస్తు దోషాలకు విరుగుడుగా ఉంటుందని నమ్మే వారు వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే చిన్నపిల్లలు నీటిలో తిరిగే చేపలను చూడడానికి ఇష్టపడతారు. ఇంట్లో చిన్నపిల్లల కోరికను తీర్చేందుకు కూడా వీటిని ఇంట్లో ఏర్పాటు చేసుకుంటున్నారు.

పెరుగుతున్న ఆసక్తి

అక్వేరియం ఏర్పాటు వెనుక కొన్ని వాస్తు నమ్మకాలు దాగున్నాయి. చైనీస్ వాస్తు ప్రకారం చేపలు అదృష్టానికి, నీరు సంపదకు గుర్తుగా భావిస్తారు. ఈ రెంటినీ కలిపి ఒకే చోట (అక్వేరియంలో) ఉంచుకుని సంపద వృద్ధిని ఆకాంక్షిస్తున్నారు. చేపలు ఎప్పుడూ కళ్లు తెరిచే స్వభావాన్ని కలిగి ఉండడంతో మనకు జరగబోయే ఆటంకాలను ముందుగా గ్రహించి కదలికలతో సమాచారం అందిస్తాయనే నమ్మకం ఉంది. అధిక లాభాలను ఆర్జించవచ్చనే నమ్మకంతో వ్యాపార సంస్థలు సైతం అక్వేరియంలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అక్వేరియంల పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. అందుకు అనుగుణంగా స్వదేశీ, విదేశీ చేపలు నేడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. దేశంలోని చెన్నై, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర దేశాల చేపలను కూడా వ్యాపారస్తులు విక్రయిస్తున్నారు.





ఆకట్టుకుంటున్న అక్వేరియం

ఉపాధికి మార్గంగా...

అక్వేరియంలో ఉంచేందుకు పలు రకాల చేపలను మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. స్కాట్‌ఫిష్, గోల్డ్‌ఫిష్, అరోవనా, రెడ్‌క్యాప్, గుప్పీస్, వైట్ ఏంజెల్, బెలూన్‌ఫిష్, బ్లాక్‌గోల్డ్‌ఫిష్, బ్లాక్ షార్క్, ఫ్లోరాస్, క్రోకడైల్ ఫిష్ వంటి 40 రకాల చేపలు లభిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.20 వేల వరకు వివిధ ధరల్లో పలు రకాల చేపలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటితో పాటు పలు రకాల మోడళ్లలో అక్వేరియంలు కూడా లభ్యమవుతున్నాయి.

పోలీస్ గ్రీవెన్స్‌కు 28 అర్జీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వివిధ సమస్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు అందాయి. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిశోర్ అర్జీదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ నేరుగా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడారు. అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాల్సిందిగా ఆదేశించారు. కుటుంబ సమస్యలు, చీటింగ్, కొట్లాట తదితర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు. ఏఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాడైన పంటల పరిశీలన


ముక్కామలలో రైతులతో మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: గోదావరి వరదల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగి చనిపోయిన విషయమై సాక్షిలో జల దిగ్బంధం శీర్షికన సోమవారం వెలువడిన కథనానికి ఉద్యానవన అధికారులు స్పందించారు. వివిధ ప్రాంతాల్లో పాడైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ, దిగువ లంకల్లో పంటలు పూర్తి పాడైపోయాయని, నష్టపోయిన పంటల వివరాలు పూర్తి స్థాయిలో తెలియాలంటే వరద పూర్తిగా తగ్గాలన్నారు. ఆ తర్వాత పంటలు పరిశీలించి అంచనాలు రూపొందిస్తామన్నారు. ఇందుకు మరో వారం ఆగాల్సి ఉంటుందన్నారు. సోమవారం కానూరు నుంచి కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం వరకు పంటలను పరిశీలించామన్నారు. వరద తగ్గాక అంచనాలు తయారు చేయాలని వీఆర్వోలు, ఉద్యానవన అధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. ఆయా గ్రామాల రైతులతోనూ మాట్లాడినట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కొయ్యలగూడెం: అదుపు తప్పిన ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని కన్నాపురం గ్రామ శివారున సోమవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం గ్రామానికి చెందిన అయినపూడి సత్యనారాయణ (60) ద్విచక్ర వాహనంపై బుట్టాయిగూడెం మండలం కండ్రికగూడెం గ్రామంలో బంధువు రెడ్డి వెంకట్రావు ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కన్నాపురం శివారున వాహనంతో చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతడిని కొయ్యలగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

కాయకల్ప తరువు

- ఆరోగ్య ప్రదాయిని.. కొబ్బరి
- నీటి నుంచి ఆయిల్ వరకు ప్రతిదీ ఔషధమే..
- నీరు, ముక్క, పాలు ఇలా ఎన్నెన్నో!
- అన్నింటా ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో సాగు
- నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కొబ్బరి చెట్టును చూస్తే గోదారమ్మ ఒడిలో ఒదిగిన అందాల బిడ్డలా కనిపిస్తుంది. ప్రకృతి అందాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అదనపు అందాలు అద్దే కొబ్బరి చెట్టు చూసి ముచ్చట పడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. తోటల్లో పంటగానే కాదు వరిచేను.. చెరువులు.. రోడ్లు.. కాలువలు.. నదీపాయల వెంబడి.. ఇళ్ల చుట్టూ కనిపించే కొబ్బరి చెట్టు గోదావరి వాసుల నుదుటిన ప్రగతి తిలకం దిద్దుతూ ఇక్కడ వారి జీవనంలో పెనవేసుకుపోయింది. కన్న కొడుకుగా పిలుచుకుంటారంటే.. వారి జీవనంలో కొబ్బరికి ఎంత ప్రాముఖ్యమో అవగతమవుతుంది.

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి ఒక్క ఉమ్మడి తూర్పులోనే 1.30 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వరి తర్వాత అత్యధికంగా సాగయ్యే కొబ్బరి ఔషధాల గని. కొబ్బరి ఉత్పత్తుల ద్వారా రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉపాధి పొందుతుంటే.. ఆయా ఉత్పత్తుల ద్వారా సామాన్యులు సైతం మెరుగైన ఆరోగ్యాన్ని పొందుతున్నారు. లక్షలాది మంది ప్రజలకు ఔషధాలను అందిస్తూ కొబ్బరి ఆరోగ్య వర ప్రదాయినిగా పేరొందింది. సెప్టెంబర్ రెండున ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.


కొబ్బరి చెట్టు

మధుమేహ రోగులకు కొబ్బరి కల్పరస



కొబ్బరి జ్యూస్ (నీరా)

కొబ్బరి జ్యూస్ (కల్లు-కల్పరసా) ఆరోగ్యానికి చేసే మేలు అంతాఇంతా కాదు. ఫెర్మంటేషన్ ఆవకుండా ఉత్పత్తి చేసే కొబ్బరి జ్యూస్ (నీరా) నేరుగా తాగినా, దీనిని నుంచి ఉత్పత్తి చేసే పంచదార, బెల్లం, తేనెను ఆహారంగా తీసుకున్నా ఆరోగ్యానికి మంచిది. ఇందులో గ్లైసమిక్ ఇండెక్స్ 25 శాతం మాత్రమే. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా దీనిని ఆహారంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

అమ్మపాలను తలపించే కొబ్బరి పాలు

కొబ్బరి ముక్క నుంచి తీసే పచ్చి పాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, బి కాంప్లెక్స్ (బి1,బి3,బి5,బి6), కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. లారిక్ యాసిడ్ (ఓ రకమైన కొవ్వు ఆమ్లం) కూడా ఉంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొబ్బరి పాలు చర్మానికి, జుట్టుకు కూడా ప్రయోజనకరం.


కోకోనట్ మిల్క్

కొబ్బరి పాలతో వర్జిన్ ఆయిల్


వర్జిన్ కోకోనట్ ఆయిల్

కొబ్బరి పాల నుంచి తయారు చేసే కొబ్బరి వర్జిన్ నూనె చర్మాన్ని తేమగా ఉంచడం, జుట్టుకు పోషణ ఇవ్వడం, బరువు తగ్గడంలో సాయపడుతోంది. మెదడు ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు, యాంటీ మైక్రోబయల్ గుణాలను కలిగి ఉంటుంది. తెల్ల రక్త కణాలను వృద్ధి చేస్తోంది. హెచ్‌ఐవీ రోగులకు ఇది చేసినంత మేలు మందులు కూడా చేయవు. శరీరాన్ని మృదువుగా ఉంచుతోంది. ఇది మంచి సౌందర్య పోషణ.

శక్తినిచ్చే పచ్చి కొబ్బరి



కొబ్బరి ముక్కల (పచ్చి లేదా ఎండు)లో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ముక్కలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరానికి శక్తి అందుతుంది. బరువు తగ్గడానికి కూడా సాయపడుతుంది.

← కొబ్బరి ముక్కలు

గుడ్డుతో సమానంగా పోషకాలు


కొబ్బరి గుడ్డు

కొబ్బరి పువ్వు (గుడ్డు)లో కోడి గుడ్డుతో సమానంగా పోషకాలున్నాయి. దీనిని ఆహారంగా తీసుకోవడం వల్ల అలసట, నీరసం తగ్గుతాయి. ఇందులో ఉండే యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాల వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే, కొబ్బరి పువ్వులో ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సాయపడతాయి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

వంటకు కొబ్బరి నూనె శ్రేష్ఠం


కొబ్బరి నూనె

కొబ్బరి నూనె ఆహారంగా తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. శక్తి పెరిగి, చర్మానికి తేమ అందుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కొబ్బరి నూనెలో ఉండే మధ్యస్థ గొలుసు కొవ్వు ఆమ్లాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. హార్మోన్ల స్థాయిలను స్థిరంగా ఉంచి, మానసిక ప్రశాంతతను పెంచుతుంది. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాల వల్ల చర్మ సమస్యలను తగ్గిస్తుంది. కొబ్బరి నూనె జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మాన్ని మృదువుగా చేస్తుంది. కొబ్బరి నూనెను తలకు పట్టించి.. మర్దన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

దివ్యౌషధం.. కొబ్బరి బొండాం

కొబ్బరి బొండాం ఓ దివ్యౌషధం. ప్రకృతి సిద్ధమైన సెలైన్. దీనిలో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సోడియం, విటమిన్ సి, బి పుష్కలంగా ఉన్నాయి. శరీరానికి అవసరమైన హైడ్రేట్లు, ఎలక్ట్రోలైట్లు ఉన్నాయి. ఇందులో దాదాపు 95 శాతం నీరుంటుంది. ఇది శరీరాన్ని తేమగా ఉంచడానికి దోహదపడుతుంది. శరీరంలో సులభంగా జీర్ణమయ్యే చక్కెర రూపంలో కార్బోహైడ్రేట్లు ఉంటాయి.


కొబ్బరి బొండాం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ప్రసాదం కౌంటర్ ఉద్యోగిపై వేటు

అన్నవరం: జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుని కొత్త నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్‌లో పని చేస్తున్న దేవస్థానం ఉద్యోగి సీహెచ్ ముని రాజేంద్రప్రసాద్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. అతడు మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నట్టు బ్రీత్ అనలైజర్ పరీక్షలో తేలడంతో విధుల నుంచి తప్పించినట్టు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు సోమవారం తెలిపారు. మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నట్టు అతడిపై ఆదివారం సాయంత్రం ఫిర్యాదు అందిందని చెప్పారు.

సస్పెన్షన్‌కు గురైన లెక్చరర్ : కాగా, సత్యదేవ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ విద్యార్థినికి కళాశాల పార్ట్ టైమ్ లెక్చరర్ వి.లచ్చన్న పలుమార్లు ఫోన్ చేసి వేధించినట్టు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై అతడిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్టు కరస్పాండెంట్, ఈఓ సుబ్బారావు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించినట్టు చెప్పారు.

13న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత వెల్లడించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మితో కలిసి ఆమె సోమవారం జిల్లా కోర్టు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా అధిక సంఖ్యలో కక్షిదారులు పరిహారం పొందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న చిట్ ఫండ్, ఇతర సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల జాబితా తయారు చేయడం, రాజీ పడదగిన ఇతర కేసులను పరిష్కరించే చర్యలపై సమీక్షించారు. సమావేశంలో చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరారీ

- పోలీసు కేసు నమోదు
- కలెక్టర్ ఆదేశాలతో సస్పెన్షన్


జుత్తుగ గణేష్

రంగంపేట: లబ్ధిదారులకు అందించాల్సిన పింఛను సొమ్ముతో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పరారయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం చంద్రేడు గ్రామ సచివాలయానికి సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.14.03 లక్షలు విడుదలయ్యాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రంగంపేట ఆర్‌సీబీ బ్రాంచ్ నుంచి సంక్షేమ, విద్యా సహాయకుడు పూర్ణచంద్రరావు గత నెల 30న ఆ మొత్తాన్ని డ్రా చేసి, పెన్షన్ల పంపిణీకి బాధ్యులైన అధికారులకు అందజేయాల్సి ఉంది. అందులో రూ.2,13,500ను వెటర్నరీ అసిస్టెంట్ జుత్తుక గణేష్‌కి అప్పగించి, అతడి వద్ద రసీదు తీసుకున్నారు. కానీ గణేష్ సోమవారం పింఛన్లు పంపిణీ చేయకుండా, విధులకూ హాజరు కాకుండా, ఫోన్ స్విచాఫ్ చేశాడు. అతడు అందుబాటులో లేకపోవడంతో పింఛనుదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీడీవో వీరసాయిబాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి బోనగిరి వెంకన్నబాబు రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శివప్రసాద్ క్రిమినల్ కేసు నమోదు చేశారు. అంతేకాకుండా, గణేష్ ఇంతకుముందు పనిచేసిన పెదపూడి మండలంలోనూ అవకతవకలకు పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో గణేష్ పెదపూడి నుంచి రంగంపేట మండలం చంద్రేడు సచివాలయానికి వచ్చాడు. చంద్రేడులో పింఛన్ల పంపిణీకి అంతరాయం లేకుండా ఉండేందుకు కొత్త పీడీఓని నియమించినట్టు ఎంపీడీవో సాయిబాబు చెప్పారు. ఈ వ్యవహారాన్ని అధికారులు కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గణేష్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సబ్ రిజిస్ట్రార్


పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ సరోజినీ కుమారి, డ్రైవర్ దుర్గారావు

ఆలమూరు: లంచం డిమాండ్ చేసినట్టు రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. రైతు నుంచి రూ.28 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సబ్ రిజిస్ట్రార్ పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన రైతు జి.సుబ్రహ్మణ్యానికి చెందిన 1.37 ఎకరాల భూమిని తన కుమారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ కె.విమల సరోజినీకుమారి రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని రైతు ప్రాధేయపడగా, రూ.28 వేలకు అంగీకరించారు. దీంతో రైతు ఆ మొత్తం తీసుకువస్తానని చెప్పి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందం దాడి చేసింది. సబ్ రిజిస్ట్రార్ విమల సరోజినీకుమారి తన కారు డ్రైవర్ దాసరి దుర్గారావుతో కలిసి రైతు నుంచి రూ.28 వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆమెతో పాటు, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కార్యాలయంలో సోదాలు నిర్వహించగా, అదనంగా రూ.35 వేల నగదు గుర్తించారు. ఆ మొత్తాన్నీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐలు వాసుకృష్ణ, భాస్కరసతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వందే భారత్ ఢీకొని వృద్ధురాలి మృతి


సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

నిడదవోలు: పట్టాలు దాటుతున్న వృద్ధురాలిని వందే భారత్ రైలు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నిడదవోలు రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం, తాడేపల్లిగూడెం మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన రేకపల్లి సీతమ్మ(65) నిడదవోలులోని కంటి ఆస్పత్రికి వెళ్లేందుకు సోమవారం ఉదయం బయలుదేరింది. బసివిరెడ్డిపేట-ఇందిరానగర్ మధ్య రైలు పట్టాలు దాటుతుండగా, అదే సమయంలో విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లే వందే భారత్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సీతమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

స్వదేశానికి క్షేమంగా చేరిన మహిళ

మస్కట్ నుంచి రప్పించిన కోనసీమ మైగ్రేషన్ అధికారులు


నాగమణి

అమలాపురం రూరల్: మస్కట్ దేశంలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఓ మహిళను కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు క్షేమంగా స్వదేశానికి రప్పించారు. తమ తల్లిని స్వదేశానికి రప్పించాలని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం ఆగర్రు గ్రామానికి చెందిన సురెళ్ల దివ్య కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను పది రోజుల క్రితం ఆశ్రయించింది. కేంద్రం ప్రతినిధులు స్పందించి.. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మన్యం నాగమణిని ఇండియాకు రప్పించినట్టు డీఆర్వో, కేంద్రం నోడల్ అధికారి కొత్త మాధవి సోమవారం తెలిపారు. ఆగర్రు గ్రామానికి చెందిన సురెళ్ల దివ్య తల్లి నాగమణి ఉపాధి కోసం 9 నెలల క్రితం మస్కట్ దేశానికి వెళ్లింది. కొంతకాలం నుంచి ఆమె ఆరోగ్యం బాగోలేక, ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆమెను ఇండియాకు రప్పించడానికి కుటుంబ సభ్యులు అనేక ప్రయత్నాలు చేశారు. ఆమెను పంపించిన ఏజెంట్‌ను అడిగితే రూ.1.60 లక్షలు కడితే కానీ ఆమెను రప్పించలేమని స్పష్టం చేశాడు. వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో, డబ్బు సర్దుబాటు కుదరలేదు. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ కలెక్టరేట్‌లో ప్రత్యేకించి వలసదారుల కోసం సెంటర్ ఫర్ మైగ్రేషన్ ఏర్పాటు చేశారని, విదేశాలకు వెళ్లే వారికి అండగా ఉంటోందని తెలుసుకుని ఈ కేంద్రాన్ని దివ్య ఆశ్రయించింది. కేంద్రం అధికారులు సంబంధిత ఏజెంట్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరించి.. నాగమణిని క్షేమంగా మస్కట్ నుంచి రప్పించే ఏర్పాట్లు చేశారు. సోమవారం నాగమణి హైదరాబాద్‌కు చేరుకుంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


ఐవీఎఫ్, సరోగసీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన చట్టాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లాలోని ఏఆర్టీ/ఐవీఎఫ్ సెంటర్లు, సరోగసీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఎటువంటి చికిత్సా కేంద్రాలు నడపరాదన్నారు. నియమావళి ప్రకారమే సేవలు అందించాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చడంలో ఏఆర్టీ, ఐవీఎఫ్, సరోగసీ ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వం గుర్తించిన, రిజిస్ట్రేషన్ కలిగిన ఆస్పత్రులు/కేంద్రాల్లోనే చికిత్స పొందాలన్నారు. అనుమతి లేని కేంద్రాల్లో చికిత్స చేయించుకోవడం వల్ల ప్రమాదాలు, మోసాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలు ఆయా విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనధికార/నమోదు కాని కేంద్రాల్లో చికిత్స చేయించుకోవద్దని సూచించారు. ఏఆర్టీ లేదా సరోగసీ ద్వారా పుట్టిన పిల్లలు దంపతుల చట్టబద్ధ సంతానం అవుతారని స్పష్టం చేశారు. వాణిజ్య సరోగసీ (డబ్బు కోసం) పూర్తిగా నిషేధించబడిందన్నారు. లింగ నిర్ధారణ, గర్భకణాల అమ్మకాలు కఠినంగా నిషేధించబడ్డాయని తెలిపారు. చట్ట ఉల్లంఘన చేసిన వారికి జైలుశిక్ష, భారీ జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. చట్టాల అమలుతో పారదర్శకత, న్యాయం, రక్షణ అన్నీ సాధ్యమవుతాయన్నారు. ప్రజలంతా అవగాహనతో ఉండి, నిబంధనలు పాటించే కేంద్రాలను మాత్రమే ఆశ్రయించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినట్టు తెలిస్తే వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఇతర వివరాలకు 81255 67830 నంబరులో సంప్రదించాలన్నారు.

స్వగ్రామానికి మృతదేహం


అర్జమ్మ మృతదేహం

అంబాజీపేట: పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన కాగిత అర్జమ్మ ఉపాధి కోసం బెహరాన్ దేశం వెళ్లి పదేళ్లుగా అక్కడే పని చేస్తోంది. ఈ ఏడాది ఆగస్టు 14న అనారోగ్యంతో ఆమె అక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చేందుకు రూ.3 లక్షల ఖర్చవుతుండడంతో ఆమె కుటుంబ సభ్యులకు ఏం చేయాలో పాలుపోలేదు. ఆ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్టీఎస్) అండగా నిలిచింది. నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో కలిసి ఈ సంస్థ ఖర్చులు భరించి, అర్జమ్మ మృతదేహాన్ని సోమవారం ఇంటి వద్ద బంధువులకు అప్పగించారు. ఇందుకు కృషి చేసిన ఆయా సంస్థల ప్రతినిధులకు మృతురాలి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.